"కాదు అదిలో పాపయ్యగారు పిఱికిమం దోయడంవల్ల" నన్నాడు బండబ్బి. అవన్నీకావు. ఇంతకూ చీకటిపడ్డం కారణమన్నట్టు ఎవరో లాంతరువేసికుంటూ వూళ్లోనుంచివచ్చి మాబండికి తోవ చూపుతూ తీసికొనివెళ్లినారు.

అవునన్నాను. భయం గియం పోయింది.

ఎవరతడన్నాను వెంకట్రామయ్యమామను. "మనకోసమే వచ్చేడు. గొల్లగంగన్న. మనింట్లో పాలుపితికేమనిషి" అన్నాడు మామ. గంగన్న "ఎడ్లమువ్వల చప్పుడు గల్లని ఇంటిదాకా వినిపిస్తే-ఎప్పుడూ వినబడలేదింత ఒడుదుడుగ్గా-బండికేదో మోసం వచ్చింది అని లాంతరేసుకు వచ్చాను. అబ్బాయిగారా? పెదెంకట్రావుగారా?" అన్నాడు.

... ... ... ... ...

## మేనల్లుని కక్కుర్తి

రైలుబండి ఎంత కుశలంగా వుంటుందో అంత కుశలంగా వుంటుంది రైల్వేఉద్యోగస్థులు కాపురముండే బస—సరిగా ఓ మగడూ ఓ పెళ్లాం పడుకోవడానికన్నా సరిపోతుందో లేదో అన్నంత పడగ్గది, దాని పక్కనే సామాను పెట్టుకోవడానికీ భోజనాలు చేయడానికీ రెండింటికీ కలిపి ఓగది, అగది కిసుకుంటా వంటగది, గజం గజన్నర చతురపుది ముందుకో చిన్న వసారా, వసారా కెదర అసుకుంటా ఓ నీళ్లోసుకునే పెరడు-అటువంటి బసలో టిక్కెట్టు కలక్టరుత్ర్యంబకం యొక్క కాపురం. మరో చుట్టం పక్కంవస్తే వసారాకో తెరేసి వసారాలో వడ్డించవలసిందే. నిదర కింకోతావు స్టేషన్ విశ్రాంతిగదిలో కుర్చీలోనో, టిక్కెట్లు అమ్మే గదిలో బల్లమీదనో చూపించాలిసిందే.

త్ర్యంబకానికి శ్రీరామారావు మేనల్లుడు. ఒకనాడు శ్రీరామారావు త్ర్యంబకాన్ని చుట్టపుజూపుగా చూడ్డానికొచ్చి, రాత్రి భోజనం

చేసి త్ర్యంబకంతో కూడా పిచ్చాపాటీ ఆడుకుంటూ స్టేషన్ ప్లాటుఫారంమీదికెక్కి మగవాళ్ళ విశ్రాంతిగది ముందున్న వసారాలోకి ఒక పడకుర్చీ లాగించుకొని మంచివీలుగా కూర్చున్నాడు.

త్ర్యంబకం "బుకింగు ఆఫీసు" గదిలో తనపనిచూచుకోవడానికివెళ్లి తిరిగి పది నిమిషాల్లోవచ్చి "నీవు హాయిగా యీ లోపల నిదరపోవచ్చును. నాకు రాత్రి డ్యూటీలేదు. నేనుపోయి పరుంటాను. తెల్లారి తిరిగి కనిపిస్తాను" అని త్ర్యంబకం వెళ్ళిపోయినాడు. శ్రీరామారా వొకమారు అట్టే వెళ్ళిపోతూవున్న మేనమామకేసిచూసి తన యదాస్థాయి కొచ్చినాడు. అతని మనస్సులో ఒక ఆలోచన ఊరికే మామ నడుగుదామా అని అడుగకుండా వుంటే మంచిదేమోననీ ఊ పీకుతూవుంది. తుద కడుగలేక పోయినాడు.

త్ర్యంబకం వెళ్లిపోయినాక అక్కడ 'లైసెన్సు' కూలీ వొకడగపిస్తే వాణ్ణిపిలచి "వొరేవు ఈ కుర్చీ కొంచెం ఆరుబయట పెట్టు" అన్నాడు శ్రీరామారావు. ఆ కూలీవాడు వెంటనే ఆకుర్చీ ఆరుబయట వేసినాడు. వెన్నెల కాస్తూవుంది. ప్లాటుఫారం మీద నాటిన క్రోటన్లు కురువేరుచెట్లు అన్నీ అదో లీలగా అగపిస్తూన్నాయి. ఓ మల్లె అంటు మొగ్గతొడిగి ముదుర మొగ్గలు కొన్ని విడిచి పరిమళిస్తూంది. ఏరైలు వచ్చేవేళ కాదది. దీపాలు చాలాభాగం ఆరిపేసేరు. ఒకటో రెండో ముఖ్యంగా వుండవలసిన వున్నాయి. గుండారుకట్టాయన స్టేషన్‌మాస్టరు తాళాలూచుకుంటూ రెండు మూడుసార్లు తిరిగి "ఒరేవు" అని మరో లైసెన్సుకూలీని పిల్చి "ఆ కుర్చీ యిలా వేయిరా" అని ఒక పేముకుర్చీ శ్రీరామారావుకు ప్రక్కగా వేయించుకుని కూర్చున్నాడు.

శ్రీరామారావు ఊరుకోలేక దొరలకైతే 'ఇంట్రడక్షన్' గాని హిందువుల కెందుకనో ఏమో—"పంతులుగారూ! తమరేనా అండీ ఇక్కడ స్టేషన్ మాష్టరుగారు?" అన్నాడు. అవునండీ అన్నాడు

ఆయన. అని ఊరుకోక "మీరేబండి కెడతారండీ" అన్నాడు. "ఏబండికి వెళ్లను. ఇక్కడకు మామగారింటికి వచ్చినాను. త్రంబకంగారు నాకు మేనమామలు" అన్నాడు శ్రీరామారావు. "అలాగా అండీ! నిక్షేపంలాంటి మీబోంట్లు మేనల్లుళ్లు వుంటూంటే వారమ్మాయి పెళ్ళికోసరంగా అలా తల్లడిల్లి తల్లక్రిందులా యోజిస్తాడేమిటండీ మా త్ర్యంబకం. రేపుదయం కదిపిచూస్తా న్నేను" అన్నాడు వెఱ్ఱిగా స్టేషన్ మాస్టరు. "ఈయన కదిపి చూసేదేమిటి? నేనే కదిపి చేసుకుంటాను" అని లోపలనుకొని శ్రీరామారావు పైకి "ఏం? మా మేనమామగారు వారమ్మాయి కీయేడు పెళ్ళిచేయడం తలంపుతో వున్నారాయేమి? చదువు కుంటూ వుందని విన్నాను" అన్నాడు. "చదువుకుంటూంటే వివాహం చెయ్యకూడదా యేమి? త్ర్యంబకంగారికి తొందఅగా వున్నా లేకపోయినా ఆయన మిత్రులం మేమంతానైన తొందర పెట్టి ఆయ నాపిల్ల నెవరికో యొకరి కీయేడు కన్యాదానం చేయించే యేర్పాటు చూడాలి" అన్నాడు స్టేషన్ మాష్టరు. ఎవరికని అడిగేడు శ్రీరామారావు. "ఎవరికేమిటి మీకే" నన్నాడు స్టేషన్ మాష్టరు.

స్టేషన్ మాష్టర్నింకా మరేమేమో అడగాలని యనుకున్నాడు శ్రీరామారావు, కాని అడగలేకపోయినాడు. అంతలో ప్రక్కస్టేషన్ నుంచి 'లైనుక్లియర్ టెలిఫోన్' గంట వినబడ్డది. స్టేషన్మాష్టరు వెళ్ళిపోయినాడు 'గుడ్‌నైట్' అంటూ........

సరిగా రాత్రి 12 గంటలైంది. వాల్తేరునుంచివచ్చే జనంగాడీ వచ్చి స్టేషన్‌లో ఆగింది. ఎక్కేజనం కిటకిట; దిగేజనం కిటకిట; వెలిగించిన దీపాలముందు వస్తువుల మిలమిల, ముఖాల కల కల—రెండవ తరగతి బండిలోనుంచి ఓయువతి దిగింది. ముఖ మీదికో బురకా కప్పుకొనివుంది. ఆమెను పోల్చుట కెవరికీ శక్యంకాకుండా. 'లైసెన్సు' కూలీమట్టుకు 'కూలీ కూలీ' అంటూ

ఆ పెట్టెదాకా వెళ్ళి అక్కడాగి వెంటనే ఆమెపెట్టి నెత్తుకుని ఆమెను తిన్నగా ఆడవాళ్ళ విశ్రాంతిగదివద్దకు తీసికొనివచ్చి లోపలవిడియించి పెట్టితానక్కడదించి వెళ్ళిపోయినాడు. ఆమెను టిక్కెట్టడిగినవారూలేరు. ఆమె దిగినసంగతి కనుక్కొన్నవారూలేరు.

దాన్నిబట్టి యోజిస్తే ఆమె అలావచ్చి యక్కడ తరుచు దిగుతూవుండడం రివాజేమో అన్నట్లు తోచకమానదు-కొంచెం బుఱ్ఱున్నవాళ్ళకు. రైలు వెళ్ళిపోయింది. ప్లాటుఫారమ్మీద దీపాలారిపోయినాయి. మరి రైలు రాత్రివచ్చేరైలు, రాత్రిపోయ్యేరైలు కూడా లేవు. కూలివాని వద్దనుంచి స్టేషన్‌మాస్టరు వరకూ హాయిగా తలుపులు తాళాలు వేసికొని యిళ్ళకుపోయి నిదరపోవచ్చును. పోవచ్చు నేమిటి? పోయి నిదరపోతూవున్నారు.

శ్రీరామారావు తన పడకుర్చీలో కూర్చుని తావత్పర్యంతం జాగరూకత్తో అన్నీ పరికిస్తూ ఒక్కమారు కన్నుమూసుకున్నాడు. నిశ్శబ్దం వంటరితనం మిక్కిలీ ఎక్కువైనకొద్దీ ఆ కన్నుమూతలో అన్నీ మాయమైపోయినయి. కాని యువతి రైలుదిగి తిన్నగా ఆడవాళ్ళ విశ్రాంతి గదిలోకి వెళ్ళడంమాత్రం మాయంగాలే. ఆ ప్రదర్శన మాలాగ్గానే యుండిపోయింది కనుకట్లల్లే.

ఎవరో నవాబుగారి కొమార్తె అని అనుకొన్నాడు. కన్ను తెఱచి ఆ గదివైపునకు చూచేడు. గదిలో దీపం వెలిగించుకొని ఆమె తన బురకా కూర్మానికి తగిలించి ఓకుర్చీ అద్దాని కెదురుగా తీసికొని తనకుదా తన చెదరిన ముంగురులు సరిగా తీసుకుంటూంది. ఆ అద్దంముం దామె ఫక్తుదొరసానిలాగుంది. పగటిపూట ఆమె దేహచ్ఛాయ బంగారు పసిమిగాదోచి నిజం దొరసానుల్లో నుంచి కేటాయింపబడితే కేటాయింప బడేదేమోగాని ఆ రాత్రివేళ ఆ దీపంకాంతిని ఆమె తొడిగికొన్న గౌనునుబట్టి, కాలికి వేసికొన్న జోళ్ళుబట్టి మేజోళ్ళుబట్టి చూస్తే జాతి దొరసానే

గట్టుమీద నడిచివచ్చి గుమ్మం కమ్ముల రెండిటమీద చెరోచెయి ఆన్చి, ఓమాటు ప్లాటుఫారమంతా కలయజూచి వెనక్కు వెళ్లింది. వెనక్కువెళ్ళి ఆగౌనూ అవీ తీసి వేసికొని రాత్రి తొడుక్కునే వొదులొడ్మవి వేసికొని తన పఱుపు పేముమంచంమీద విప్పుకొని తిరిగి గుమ్మంవద్దకు వచ్చి యిటూ అటూ చూచి తలుపులు వేసికొని పండుకుంది.

శ్రీరామారావు ఆమె గుమ్మందగ్గరకు వచ్చినప్పుడల్లా కళ్లు మూసికొని మరి తక్కినప్పుడల్లా కళ్లుతెరచుకొని ఆమెను గమనిస్తూ వున్నాడు. "ఆమె బీబీకాదు, ఎవరో దొరసాని" అని అను కున్నాడు. అదే యూహతో నిదరోయేడు. టెలిగ్రాఫ్ గదిలోని గడియారం టంగుటంగున అయిదు కొట్టింది- సిగ్నలర్ వెంకట స్వామి బసముందరి కోళ్ళు కొక్కొరోకో మనడం వినిపించింది. వేగుచుక్క వెలవెలమంది.

"మంచు చాలాకురిసింది రాత్రి" అని తన పడక్కుర్చీ లోంచి ఒళ్ళు విరుచుకుంటూలేచి శ్రీరామారావు ఉత్తినే మల్లె పొదకేసివెళ్లీ పువ్వులుకోస్తూ వున్నాడు, గుప్పెడు కోసినాడు.

అప్పుడు ఆడవాళ్ళ విశ్రాంతి గదిలోనుంచి యువతి తన పెట్టే బేడా సర్దుకొని చీర కట్టుకుని, జాకెట్టు తొడుక్కుని మామోలు హిందూయువతిమల్లే చిన్న కుంకుం బొట్టుంచుకొని ఓ పుస్తకం చేత్తోపుచ్చుకుని యీవలకువస్తూ తలుపు తాళంవేసి ఆ తాళపుగుత్తులు తన మొల్లో గ్రుచ్చుకుని అలా ప్లాటుఫారం అంట యాదాలాపంగా నడుస్తూవుంది. నడుస్తూ "ఎవరా పువ్వులు కోసేది ?" అని కేకేసింది. "నేను త్ర్యంబకంగారి మేనల్లుణ్ని శ్రీరామారావుని" అని శ్రీరామారావు వెనక్కితిరిగి చూచినాడు.

ఆ యువతి తన మామగారి కూతురని పోల్చుకున్నాడు. నిర్విణ్ణుడైపోతూ గబుక్కునదేరి "ఎక్కణ్ణుంచిరాక సుందరమ్మా !" అని యడిగేడు. "నీ వెక్కన్నుంచి వచ్చేవు?" అంది సుందరమ్మ.

"నేను రాతిరంతా యిక్కడే ఆ పడక్కుర్చీలో పరున్నాను, మీయింట చోట్లేక" అన్నాడు. "మా ఇంట చోటుండదు. రాత్రి తండ్రికి నిదరభంగం కలుగచేయడ మెందుకు అని నేనూ రాత్రి ఒంటిగంటనుండి యిక్కడే ఆడవాళ్ళ విశ్రాంతిగదిలో పరున్నాను" అంది సుందరమ్మ. అని యింకా అంది. "అయితే శ్రీరామారావు! మీతండ్రి మాతండ్రిని కట్నం 5000 అడుగు తున్నాట్టగా" అని అడిగింది. "ఆ సమస్య ఎలా తేల్చడానికి నాకు చేతకాక యిక్కడికొచ్చిన్నీ, నిన్నట్నుంచి కొట్టుమిట్టాడి పోతున్నాను" అన్నాడు శ్రీరామారావు.

"అయితే రా! ఎన్ని పువ్వులు కోసినావు మల్లెపువ్వులు? నాకోసమేనా" అని ఆ పువ్వులన్నీ అతగాని గుప్పిట్లోంచి ఉళ్ళా క్కుని "రాతిరల్లా నాకు సరిగా నిదరపట్టలేదు. ఆరుబయట నీవనితెలిస్తే నేనుకూడా నీకుర్చీ ఆరుబయట వేయించుకొని పరుండేదాన్నిసుమ్మా" అంది. "నీవోమారు బీబీలాగ గనిపించేవు. ఓమారు దొరసానిలా గగపించేవు పలకరిద్దామా అంటే" అన్నాడు శ్రీరామారావు. "ఎవరూ పలకరించకుండా వుంటారని రైల్లో బీబీవేషం వేసికొని వెయిటింగు రూమ్సులో దొరసానుల వేషం వేసికొని కూర్చుంటూ వుంటాను. హిందూయువతిగా కనిపిస్తే అంతా అడిగేవాళ్లే "పెళ్లైందా? పిల్లలెంతమందమ్మా? మీ అత్తారివూ రేవూరు? ఎవరమ్మాయివి? అని most irrelevant questions" అంది సుందరమ్మ. "అయితే ఆ ప్రశ్నలు lovers lovers ని అడిగినా irrelevant ప్రశ్నలేనా?" అన్నాడు శ్రీరామా రావు. "Lovers అడుక్కొనక్కర్లేదు, వాళ్ళకన్యోన్యం అంతా looks వల్లనే తెలిసిపోతుంది. తెలియడంలే నీకు?" అంది ఆమె. "తెలియకేం your·looks make my father lose RS. 5,000 and your father gain Rs. 5,000" అన్నాడు అతడు. "Why of fathers? Think of us. We are neither losers nor gainers. we are lovers" అంటూ శ్రీరామారావుతో చెట్టాపట్టాలేసికొని అతణ్ణి ఇంటికితీసికొని వెళ్లింది ఆమె.

కట్నం పుచ్చుకోకుండా చి. సౌ. సుందరమ్మను, చి. శ్రీరామారావు వివాహమైనాడని కథ పూర్తిచేస్తూ ఆ నూతన వధూవరుల్ని దీవించడానికి సందేహం ఎందు కింక ?

... ... ... ... ...

## ఇంకెందుకు ఇల్లు?

"సెనగలు అంగడిలో అమ్ముతారు. సెనగలు పొలంలో పండుతాయి. సెనగలు నీవట్టుకొచ్చేదేమిటి ? నేనే కొనుక్కొని నేనే పండించుకొని ఏ పకోడీలో, వీపాఠోళివో చేసికొని నీకు పెట్టకుండా తింటానుచూడు" అన్నాడు త్రివిక్రమరావు. అంటే అతనిభార్య విజయలక్ష్మి "నేను తెచ్చే సెనగలకు మీరు తెచ్చే సెనగలకు సహస్రంవారుంటుంది. వెళ్లి తెచ్చేబుద్ధి పుట్టాలినాకు. ఎంచేతో ఈ యేడు పేరంటానికి వెళ్ళడమంటే బుద్ధిపుట్టడంలేదు. మీరు వండబొయ్యే పిండివంటతిని యింట్లోనే కూర్చుందామని వుంది" అంది.

ఆపొద్దు శ్రావణమంగళవారం. అంతకుపూర్వం ఎంతసేపట్నుంచి భార్యాభర్తలిరువురూ అలా తర్కించుకుంటూ కాలం వెళ్ళబుచ్చేరో ఎవరికీ తెలియదు. అప్పుడే తపాలబంట్రోతు "ఉత్తరాలొచ్చాయండో" అని తలుపుసందంట పడేసి వెళ్ళిపోయినాడు. ఆ యుత్తరాలు మూడో నాల్గో విజయలక్ష్మి తీసి తిన్నగాతెచ్చి త్రివిక్రమరావుచేత పెడుతూ "దీనికి బిళ్ళలేదేమిటండి ?" అని అడిగింది. 'దేనికి ?' అని త్రివిక్రమరావు "తపాలా బంట్రోతు ఉత్తరాలు తీసికొని వచ్చినాడూ అంటే 2 ఘంటలపరాహ్నం తిరిగిందన్నమాటే. కాఫీకి 'స్టవ్' అంటించావుకా వింకా ?" అని "దీనికా ?" అని అమూడు నాలుగుత్తరాల్లోనూ ఒక కవరుతీసి ఇటూ అటూ చూచి "బిళ్లలేక పోవడమే కాకుండా